వ్యాధుల కాలం.. జరభద్రం

- కురిసి వెలుస్తున్న వర్షాలతో జ్వరాలు ప్రబలే అవకాశం
- ముందస్తు జాగ్రత్తలు అవసరం
- దోమల నిర్మూలనకు నీటి నిల్వల తొలగింపు అవశ్యం
- ఇంటింటా చర్యలు చేపడుతున్న జీవీఎంసీ మలేరియా బృందాలు

మద్దిలపాలెం: అసలే వ్యాధులు ప్రబలే వర్షా కాలం.. ఆపై ప్రజలను వణికిస్తున్న విషజ్వరాలు.. ఈ సమయంలో తగు ముందు జాగ్రత్తలే శ్రీరామరక్షని జీవీఎంసీ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కురిసి వెలుస్తున్న వర్షాలతో జ్వరాలు ప్రబలే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్నాయి. మరో వైపు దోమ కాటు ద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పేరుకుపోయిన నీటి నిల్వలు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వల తొలగింపు ప్రక్రియ చేపట్టడం ఎంతో అవసరం. తద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా జ్వరాల బారిన పడకుండా రక్షణ పొందగలం. ఈ నేపథ్యంలో వర్షా కాలం జాగ్రత్తలకు సంబంధించి జిల్లా మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ ప్రజలకు పలు సూచనలిచ్చారు.



అప్పుఘర్‌లో ఫ్రిడ్జ్ ట్రే నీటిలో లార్వాను గుర్తిస్తున్న ఆరోగ్య కార్యకర్త కె.వేణుగోపాల్ బృందం

జీవీఎంసీ జోన్-3 పరిధిలోని ముఖ్యమైన, సమస్యాత్మకమైన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల కట్టడి, దోమల నిర్మూలనకు చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిల్వ నీటిలో దోమల ఉత్పత్తి

వర్షపు నీరు ఇంటి పరిసరాలు, ఖాళీ సీసాలు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు, రుబ్బురోలు తదితర వాటిలో నిల్వ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి చిన్న ఖాళీ పాత్రలో నీటి నిల్వలున్నా దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయి. వారానికి పైగా నీటి నిల్వలుంటే దానిలో లార్వా పెరుగుతుంది. అది కాస్తా 12 రోజుల వ్యవధిలోనే దోమగా రూపాంతరం చెందుతుంది.



చినగదిలిలో సర్వేను పరిశీలిస్తున్న మలేరియా విభాగం సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్



శివాజీపాలెంలో పూల కుండీ నుంచి లార్వా తొలగిస్తున్న యాంటీ లార్వా ఆపరేషన్ బృందం

ఏడు రోజుల్లో జ్వరం

దోమ కాటు వేసిన ఏడు రోజుల వ్యవధిలో జ్వరం వస్తుంది. ఇలా వస్తే ముందస్తుగా రక్త పరీక్షలు చేయించుకోవాలి. దానిలో మలేరియా నిర్ధారణైతే 15 రోజుల పాటు వైద్యం పొందాల్సి ఉంటుంది. మలేరియా నిర్ధారణ కాకపోతే వెంటనే డెంగ్యూ పరీక్ష చేసుకోవాలి. అది నిర్ధారణైతే వైద్యుడి సూచన మేరకు చికిత్స పొందాలి. డెంగ్యూ వైద్య పరీక్ష అలస్యమైతే ప్లేట్ లెట్స్ తగ్గే అవకాశాలుంటాయి. జ్వరం రాగానే వెంటనే మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేసుకోవడం ఎంతో అత్యవసరం.



ముడసర్లోవ రోడ్డులో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు ఉచితం

మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్‌తోపాటు ఖరీదైన వైద్య పరీక్షలన్నీ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా చేస్తున్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలి. దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా, చికున్‌గన్యా వంటి జ్వరాలను గుర్తించేందుకు జ్వరం వచ్చిన వెంటనే ముందుగా రక్త పరీక్షలు చేసుకోవాలి.

డ్రైడే తప్పనిసరిగా పాటించాలి

ప్రతి శుక్ర, మంగళవారాల్లో జీవీఎంసీ నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. దోమల ఉత్పత్తికి నిల్వ నీటి వనరులే కేంద్రాలు. నీటి నిల్వల తొలగింప ప్రక్రియ ఎంతో కీలకం. ఈ చర్యల భాగంగా జీవీఎంసీ మలేరియా విభాగం ఆధ్వర్యంలో యాంటీ లార్వా ఆపరేషన్ బృందం ఇంటింటా తనిఖీలు చేపడుతోంది. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు గుర్తించి తొలగిస్తోంది. ముఖ్యంగా ఇంట్లో వినియోగించే ఫ్రిడ్జ్, ఏసీల నుంచి వచ్చే నీటిని నివాసులు గుర్తించి తొలగించాలి. ఈ ప్రక్రియ సిబ్బంది సూచనలకు అనుగుణంగా ప్రతి వారం ఎవరికి వారు చేపట్టడం ద్వారా దోమల కాటు నుంచి రక్షణ పొందవచ్చు.



లాసన్స్ బేకాలనీలో స్థానికులకు బాటిల్‌లో లార్వాను చూపిస్తూ అవగాహన..

జోన్-3లో విస్తృతంగా చర్యలు

జీవీఎంసీ జోన్-3 పరిధిలో దోమల నివారణకు జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. డెంగ్యూ, మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నీటి నిల్వల్లో దోమల వృద్ధి చెందకుండా అరికట్టేందుకు యాంటీ లార్వా సిబ్బంది చర్యలు తీసుకుంటోంది. డెంగ్యూ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫాగింగ్‌తోపాటు ఇండోర్, అవుట్ డోర్ స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నారు. పార్డుల వారీగా యాంటీ లార్వా బృందాలు పిన్‌పాయింట్ ప్రకారం ఇంటింటి సర్వేలను సమర్థవంతంగా చేపడుతున్నాయి. ఇళ్ల వద్ద గుర్తించిన నీటి నిల్వలు తొలగించడం, దోమల వృద్ధి చెందకుండా మందులు పిచకారీ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఏయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



మహిళా హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏయూ అధికారులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల హాస్టళ్లను బుధవారం రాత్రి అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఇంజినీరింగ్ కళాశాల బాలికల వసత గృహాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థినులు ఉంటున్న తీరును ప్రత్యక్షంగా చూశారు. అనంతరం ప్రగతి, విద్యా తరంగిణి, నాగార్జున, ఫార్మసీ విద్యార్థినుల హాస్టళ్లకు వెళ్లారు. విశ్వవిద్యాలయాన్ని ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దడంతో భాగంగా అధికారులు ఈ తనిఖీ చేపట్టారు. విద్యార్థుల భద్రత, క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, హాస్టల్స్ చీఫ్ వార్డెన్లు దుర్గారాణి, హరినాథ్, రమేష్‌బాబు, చిట్టిబాబు, ఏయూ సెక్యూరిటీ విభాగం డీన్ ఆచార్య పి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: జిల్లా మహిళా కేంద్రంలో నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీలోని జిల్లా మహిళా కేంద్రంలో ఈ శిక్షణ ఇస్తామని చెప్పారు. బేసిక్ సూయింగ్ మెషిన్ ఆపరేటర్, టైలరింగ్, మగ్గం వర్క్‌లో శిక్షణ కోసం ఎనిమిదో తరగతి చదివి ఉండాలన్నారు. బ్యూటీషియన్‌లో శిక్షణ కోసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరదలచిన మహిళలు 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఆయా కోర్సులకు రెండు నెలలు పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ మహిళా యువతులు, గృహిణులు ఈ నెల 18లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 62812 61415 నంబర్‌లో సంప్రదించాలని విమల కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని లాసెన్స్‌బే కాలనీకి చెందిన వై.పరదేశి అనే దాత రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావుకి అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ



విద్యార్థి మహీధర్ వర్మను అభినందిస్తున్న ఆచార్య బోస్ తదితరులు

ఎంవీపీకాలనీ: విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో జరిగిన ఏపీ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2024 పోటీల్లో ఎంవీపీ కాలనీ గాయత్రి కళాశాల విద్యార్థి పి.మహీధర్ వర్మ ప్రతిభ చూపాడు. ఏపీ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో అండర్-19 కేటగిరీలో బీఎస్సీ కంప్యూటర్స్ ఫస్టియర్ చదువుతున్న మహీధర్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచాడని కళాశాల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా మహీధర్‌కు ఆచార్య కె.ఎస్.బోస్, కళాశాల డైరెక్టర్ డి.గిరిధర్, ఫిజికల్ డైరెక్టర్ పి.కిశోర్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

గణపతి ఉత్సవాల్లో అన్నసమారాధనలు



ఆరిలోవలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. టీఐసీ పాయింట్, క్రాంతినగర్ మండపాల వద్ద విఘ్నేశ్వరుడిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అక్కడ జరిగిన అన్నదానాల్లో మేయర్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. టీఐసీ పాయింట్, క్రాంతినగర్, విద్యా కాలనీ, అంబేడ్కర్ నగర్, ఎస్టీ కాలనీ జ్యోతినగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆదర్శనగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గేదెల నాగరాజు తదితరులు

17వ వార్డులో..

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'గొడుగు' అసోసియేషన్ విరాళం

ఎంవీపీకాలనీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శివాజీ పార్కు గొడుగు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.1,44,116 విరాళం అందజేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఆ నిధులను చెక్కు రూపంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు బుధవారం అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరద ముంపు విజయవాడ వాసులకు తీరని విషాదాన్ని నింపిందన్నారు. అనేక కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయన్నారు. ఈ నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి పైమొత్తాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శివరామకృష్ణ, వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, వి.సత్యనారాయణ, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెలగపూడికి చెక్కు అందజేస్తున్న గొడుగు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

దేశ సంస్కృతిని కాపాడాలి

ఆరిలోవ: భారతీయ సంస్కృతిని ప్రతి ఒక్కరూ కాపాడాలని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో హెరిటేజ్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాడ్జ్ సెరమనీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, విద్యార్థులతో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా బ్యాడ్జ్ సెరమనీ ప్రతి మేటా నిర్వహించడం అభినందనీయమన్నారు. స్వామి వివేకానంద్ చికాగో ప్రసంగంలో అమెరికా ప్రజలకు భారత సంస్కృతి గురించి వివరించిన రోజే విశాఖ వ్యాలీ స్కూల్‌లో బ్యాడ్జ్ సెర్మనీ నిర్వహించడం యాదృచ్ఛికమన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత విశేషాల గురించి విద్యార్థులకు వివరించారు. మంచి మార్గంలో నడవాలని, ప్రస్తుతం సోషల్ మీడియాను వినియోగించే వ్యవహారంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు గౌరవం తీసుకురావాలన్నారు. చదువుకున్న పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వెళ్లే స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇంటాక్ విశాఖపట్నం చాప్టర్ సభ్యులు, హెరిటేజ్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.



విశాఖ వ్యాలీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న లక్ష్మీనారాయణ

వసుధైక కుటుంబ భావనను పెంపొందిద్దాం

విశాఖ సిటీ: ప్రజల్లో ఐక్యతా భావనను పెంపొందించి వసుధైక కుటుంబ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏయూ జాతీయ సేవా పథక సమావేశ మందిరంలో బుధవారం గణతంత్ర దినోత్సవ పరేడ్ ఎంపిక శిబిర ప్రారంభ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొని ఏయూ ఖ్యాతిని పెంచాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి జాతీయ సేవా పథక ప్రాంతీయ సంచాలకుడు ఎం.రామకృష్ణ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో జరిగే ఎంపిక ప్రక్రియలో ఎంపికైన వారు వచ్చే నెలలో మహారాష్ట్రలోని పూణేలో జరిగే పూర్వ గణతంత్ర శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ ఎంపికైన వారికి ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈటీవి కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రామచంద్రరావు, ఏయూ జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హర్‌నాథ్, విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, విజయనగరం ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

వినాయక పందిళ్లలో దొంగతనాలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో చిల్లర దొంగల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. రాత్రివేళ వీధుల్లో కిరాణా షాపుల వద్ద డెయిరీ వ్యానులు వేసిన పాల ప్యాకెట్లు, న్యూస్ పేపర్ కట్టలు, ఇళ్ల ముందు నిలిపిన బైక్‌ల్లో పెట్రోల్ దొంగతనాలు రోజూ ఏదోచోట జరుగుతున్నాయి. అంతటితో ఆగకుండా వినాయక పందిళ్లను కూడా వీరు వదలడం లేదు. నాలుగు రోజులుగా జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను చిల్లర దొంగలు వినియోగించుకుంటున్నారు. మంగళవారం రాత్రి ఆరిలోవ ప్రాంతం టీఐసీ పాయింట్ నుంచి అంబేడ్కర్ నగర్ వరకు మూడు చోట్ల వినాయక పందిళ్లలో దొంగతనాలు జరిగాయి. భక్తులు కానుకలు వేసిన హుండీలు, అక్కడ నిద్రపోతున్న నిర్వాహకుల సెల్‌ఫోన్‌లు పట్టుకుపోయారు. విశాలాక్షినగర్‌లో ఓచోట వినాయక పందిరి వద్ద ఏర్పాటు చేసిన సౌండ్ బాక్స్ పట్టుకుపోయారు. వీటిపై ఆయా ఉత్సవ కమిటీల నిర్వాహకులు బుధవారం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి కొన్ని సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బీచ్‌రోడ్డు: శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల పెరుగుదల అధికంగా ఉందని మెడికల్ సేఫ్టీ సైన్సెస్(ఇండియా) రెస్టోరేటివ్ అండ్ డైజెస్టివ్ హెల్త్(ఏపీఏసీ), కెన్‌వ్యూ హెడ్ డాక్టర్ ప్రీతి ఠాకోర్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ ఫ్లూ, ఇన్‌ఫ్లుఎంజా, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతూ ఉన్నాయన్నారు. వైరల్ జ్వరాలు, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల వ్యాప్తితో ఆరోగ్య నిపుణులు రికవరీ ప్రక్రియకు ద్రవాలు, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల సమయంలో శరీరం చెమట ద్వారా ద్రవాలను కోల్పోతుందని, డీహైడ్రేషన్ రోగ నిరోధక శక్తిని దెబ్బ తీస్తుందన్నారు. సాధారణ శారీరక విధులు నిర్వహించడానికి ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు పునరుద్ధరించడం ముఖ్యమన్నారు. గ్లూకోజ్ రూపంలో శక్తిని ఇవ్వడం కూడా ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్రవాహనంపై ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వారు తుళ్లిపోయి పక్కనే ఉన్న గోతిలో పడిపోయారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సపర్యలు చేశారు. మహిళా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అపస్మారక స్థితికి చేరుకుంది. భార్యాభర్తలను వైద్యం నిమిత్తం విశాఖ తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ షణ్ముఖరావు తెలిపారు.

నిమజ్జన ప్రాంతాలను సందర్శించిన సీపీ



నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: వినాయక విగ్రహాలు నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి బుధవారం రాత్రి సందర్శించారు. నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలించారు. జాలరిపేటలో సందర్శించి నిమజ్జన ప్రాంతాలకు వెళ్లే రహదారులు ట్రాఫిక్ లేకుండా ఉండాలని, మద్యం మత్తులో ఎవరూ ఆయా ప్రాంతాల్లో తిరగకూడదని సిబ్బందికి సూచించారు. గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచాలని, డబ్బులు డిమాండ్ చేయకుండా నిమజ్జనానికి సహకరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అప్పికొండ వద్ద నిమజ్జన ప్రాంతానికి వెళ్లి పర్యవేక్షించారు.

వ్యాధుల కట్టడికి ప్రత్యేక చర్యలు

అక్కిరెడ్డిపాలెం: సీజనల్ వ్యాధుల కట్టడికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. అక్కిరెడ్డిపాలెం, సిద్ధేశ్వరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కిరెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, మలేరియా, డెంగ్యూ, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది అంతా ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని, లీవ్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్ తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు అందించాలన్నారు. సిజేరియన్ ప్రసవాలు నివారించాలని, ముఖ్యంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ శత శాతం పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం కాబట్టి కీటక జనిత వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎంవో బి.నాగేశ్వరరావు, పట్టణ కేంద్ర ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ముడసర్లోవ రహదారుల్లో గేట్లు మాయం

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రహదారుల్లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఇనుప గేట్లను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించేశారు. మళ్లీ ఈ రోడ్లు గృహ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. విశాలమైన ఇక్కడి రోడ్లపై ఆరిలోవతోపాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాలను లారీల్లో తీసుకువచ్చి డంప్ చేస్తుండేవారు. వీటితో నిండిపోయిన రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులతో కలసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి గతేడాది ఈ రోడ్లను పరిశీలించి, వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆ ప్రాంతంలో లారీలు ప్రవేశించడానికి వీలు లేకుండా రూ.లక్షలు ఖర్చు చేసి నాలుగు చోట్ల ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటిని ఎవరో వ్యక్తులు మాయం చేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. లారీలతో వ్యర్థాలు తీసుకువెళ్లి రోడ్ల పక్కన కుప్పలుగా వేసేస్తున్నారు. రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతోపాటు పర్యావరణం కలుషితమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డులో తొలగించిన ఇనుప గేట్లు

మందకొడిగా నర్సరీ నిర్మాణ పనులు



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక నిర్మిస్తున్న జీవీఎంసీ నర్సరీ

ఆరిలోవ: జీవీఎంసీ నర్సరీ నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. సుమారు ఏడాది గడుస్తున్నా గోడలు నిర్మాణం పూర్తి కాలేదు. బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని దీన్‌దయాల్‌పురం వద్ద జీవీఎంసీ నర్సరీ ఉండేది. దీనిలో వివిధ రకాల మొక్కలను ఉత్పత్తి చేసేవారు. రోడ్ల డివైడర్లు, రోడ్ల పక్కన నాటడానికి మొక్కలను ఇక్కడ నుంచే పంపిణీ చేస్తుండేవారు. ఈ నర్సరీ స్థలంలో ప్రస్తుతం జీవీఎంసీ పిల్లల పార్కు నిర్మిస్తోంది. దీంతో ఇది మూతపడింది. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక జీవీఎంసీకి చెందిన విశాలమైన స్థలంలో చుట్టూ గోడలు, ముఖద్వారంతో నర్సరీ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పనులు ప్రారంభించి సుమారు ఏడాది గడుస్తోంది. నిర్మాణుష్య ప్రదేశంలో జరుగుతున్న ఈ నిర్మాణంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఈ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. స్థలం చుట్టూ గోడ, మొక్కల ఉత్పత్తి, పెంపకం కోసం స్థలాన్ని చదును చేయడం, ప్రవేశ ద్వార నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో ఇక్కడ కొత్త మొక్కల ఉత్పత్తి, వాటి పెంపకం ఆలస్యమవుతోంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎంవీపీకాలనీ: ఏపీఈపీడీసీఎల్ ఎంవీపీ కాలనీ సెక్టార్-1, సెక్టార్-2 కొత్త వెంకోజీపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ బి.సింహాచలం నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.